విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :35 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 29 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం!



- మోదీ కేబినెట్‌లో మార్పులు- చోటు దక్కేది ఎవరికి?
- మోదీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై పెరుగుతున్న ఊహాగానాలు
- యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం
- బంగాల్‌లో ఎంపీలకు మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు ప్రచారం

## తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలి

- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ
- తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలంటూ కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ
- మామిడి పల్ప్ ఎగుమతులు నిలిచిపోయాయని లేఖలో పేర్కొన్న సీఎం
- రైతులను ఆదుకునేలా రూ.281 కోట్ల ఆర్థికసాయం చేయాలన్న సీఎం



**అమరావతి**

రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం- పీడీపీఎస్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. దేశంలోనే మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని రాష్ట్రవ్యాప్తంగా 3.99 లక్షల హెక్టార్లలో సాగవుతూ 52.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో దాదాపు 91,011 హెక్టార్లలో తోతాపురి రకం సాగవుతోందని చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా 8.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తూ లక్షలాది రైతు వివరాలు 2లో..

## ప్రభుత్వ బడుల్లో స్మార్ట్ కిచెన్లు

- జగన్ ఆరోపణలపై మంత్రి లోకేశ్ తీవ్ర విమర్శలు
- స్మార్ట్ కిచెన్లపై రాజకీయ విమర్శలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వేతనాలపై ఆరోపణలు నిరాధారమన్న మంత్రి లోకేశ్?



**అమరావతి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత, నాణ్యత, రుచితో కూడిన మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్లపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో వివరాలు 2లో..



## నా పిలుపుతో బంగారం కొనుగోళ్లు తగ్గించారు

- సంక్షోభం వేళ ప్రజల సహకారం ప్రశంసనీయం
- మన్ కీ బాత్ 135వ ఎపిసోడ్‌లో ప్రజల చొరవను ప్రశంసించిన ప్రధాని
- బంగారం కొనుగోళ్ళు తగ్గించాలన్న పిలుపుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్న మోదీ

## మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా..

- అమెరికా దాడులకు ప్రతీకారంగా బ్రహ్రెయిన్, కువైట్ లను టార్గెట్ చేసిన ఇరాన్
- కువైట్, బ్రహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు
- తమపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా ఈ చర్య చేపట్టినట్లు ఇరాన్ ప్రకటన
- ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన
- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి తీవ్రమైన హెచ్చరిక



## సంతానం భారం కాదు, సంపద




- పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి : సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా పల్స్ పోలియో కార్యక్రమం
- చిన్నారులకు పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు
- పరిస్థితులు మారాయి - ఇప్పుడు సంతానం భారం కాదు సంపదన్న సీఎం

**అమరావతి**

జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ క్రమంలోనే తన క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు సీఎం చంద్రబాబు పోలియో చుక్కలు వేశారు. అనంతరం చిన్నారుల వివరాలు 2లో..



## ముంబై మొహర్రం ఊరేగింపులో భారీ కుట్ర భగ్నం

- 15,000 మందిని చంపేందుకు యత్నం!
- నిందితుడి నుంచి 14,900 విషపూరిత క్యాప్సూల్స్ స్వాధీనం
- 15,000 మందిని చంపాలన్నదే తన లక్ష్యమని నిందితుడి వాంగ్మూలం
- నొప్పి నివారణ మందులని చెప్పి ఎలుకల మందు పంపిణీ
- సకాలంలో స్పందించి భారీ ప్రాణనష్టాన్ని నివారించిన పోలీసులు

## జనసంద్రమైన స్వర్ణాల చెరువు



- మూడో రోజు రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు
- మూడో రోజు కోలాహలంగా రొట్టెల పండగ
- స్వర్ణాల చెరువు వద్ద నెలకొన్న భక్తుల కోలాహలం

## సౌదీలో ఘోర ప్రమాదం..

- హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం
- సౌదీ అరేబియాలో కుప్పకూలిన అరామ్కో హెలికాప్టర్
- ప్రమాదంలో 14 మంది సౌదీ పౌరులు మృతి
- రస్ తనూరా తీరంలో ఆదివారం ఉదయం ఈ ఘటన
- ప్రమాద కారణాలపై సౌదీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ సంతాపం



# ప్రభుత్వ బడుల్లో స్మార్ట్ కిచెన్లు

-మొదటిపేజీ తరువాయి

విమర్శించడం తగదని ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం అందుతుండగా, వేలాది మంది మహిళలు, పేదలకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయని చెప్పారు.

**కడపలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం**

వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు లోకేశ్ తెలిపారు. ఈ కిచెన్ల పరిధిలో ఇప్పటికే పనిచేస్తున్న 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల ఉపాధికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు.

**కొత్త కిచెన్లతో మరిన్ని ఉద్యోగాలు**

జిల్లాలో మరో 33 స్మార్ట్ కిచెన్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి లోకేశ్? వెల్లడించారు. వీటి ద్వారా ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలతో పాటు అదనంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ కిచెన్ల విస్తరణతో వేలాది మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.



**వేతనాలపై ఆరోపణలు నిరాధారం**

స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో పనిచేస్తున్న కుక్-కమ్-హెల్పర్లకు వేతనాలు చెల్లించలేదన్న ఆరోపణలను కూడా లోకేశ్ ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో ఆ నెలకు గౌరవ వేతనాల చెల్లింపు ఉండదని స్పష్టం చేశారు. జూన్ నెల ఇంకా పూర్తికాకముందే బకాయిలపై ఆరోపణలు చేయడం వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. జగన్ ఎవరి బకాయిలు గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం లక్ష్యం**

స్మార్ట్ కిచెన్ల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందించడమేనని మంత్రి వివరించారు. ఆధునిక వంటశాలల ద్వారా ఆహార నాణ్యత మెరుగుపడటం ఉంటుందని చెప్పారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

**జగన్‌పై లోకేశ్ ప్రశ్నలు**

పేద పిల్లలకు మంచి ఆహారం అందించడం, మహిళలకు ఉపాధి కల్పించడం కూడా సహించలేకపోతే ఎలా అని మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను లోకేశ్ ప్రశ్నించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు ఆరోపణలు చేయకుండా, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని ఆయన అన్నారు.

# ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు. ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్ధన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది. ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

# విధేయత ... అనిశ్చితా...

**విజయవాడ :** వైసీపీలో మాత్రం జగన్ మాటకు ఎదురుండదు. ఆయన దృష్టిలో పడితే మంత్రి పదవి గ్యారంటీ. అందుకే వైసీపీ నేతలు యాక్టివ్ గా ఉంటారు. మిగిలిన పార్టీలలోఅలా ఉండదు. ఎవరికి చివరి నిమిషంలో మంత్రి పదవి దక్కుతుందన్నది ఎవరికీ తెలియదు. కానీ జగన్ విషయంలో అలా కాదు. తాను డిసైడ్ అయితే ఇక జగన్ ను ఇన్ ఫ్లుయెన్స్ చేసే మరొకరు పార్టీలో లేకపోవడంతో ఎక్కువ మంది నేతలు జగన్ దృష్టిలో పడతారు. అందుకే పదకొండు సీట్లకు పరిమితమయినా వైసీపీ మంచి ఊపు మీద ఉండటానికి ఇదే కారణం. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తమకు ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అలాగని అంబటి రాంబాబు, పేర్ని నానిలు కేవలం పదవుల కోసమే చేసే వారు మాత్రం కాదు. జగన్ అంటే వారికి పిచ్చ అభిమానం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఇద్దరూ కాంగ్రెస్ లోనే ఉన్నారు. తర్వాత జగన్ పార్టీలో చేరారు. పార్టీ ఓడినా, గెలిచినా వీరు మాత్రం జగన్ మాట జవదాటరు. పార్టీని వదిలి వెళ్లాలన్న ఆలోచన చేయరు. జగన్ కోసం వీళు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి మాత్రం ఎఫెన్స్ గానే ఉన్నారు. ఎన్ని కేసులు నమోదయినా వెనక్కుతగ్గరన్న పేరుంది. జగన్ పట్ల విధేయతగా ఉండటంతో పాటు జగన్ పై ఎవరు విమర్శించినా వెంటనే మీడియా ముందుకు వచ్చి నాలుగు దులిపి వెళతారు. ఇద్దరూ కాపు సామాజికవర్గం నేతలయినప్పటికీ ఏనాడూ జగన్ పార్టీ నుంచి బయటకు వెళ్లాలన్న ఆలోచన కూడా చేయరు. అంతేకాదు తమ సొంత సామాజికవర్గమే అయినా పవన్ కల్యాణ్ పై విమర్శలకు వెనుకాడరు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయాల్లో ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి. ఆయన తన నాయకులకు, ప్రతినిధులకు ఇచ్చే బాధ్యత చాలా క్లియర్ గా ఉంటుంది. ఎవరు ఏం మాట్లాడాలి, ఏం చేయాలి అన్న దానిపై సందిగ్దత ఉండదు. జగన్ కోసమే నిలబడటమే తెలుసు తప్ప.. సొంత సామాజికవర్గం దూరమవుతుందన్న ఆలోచన కూడా చేయరు. అయితే వీళ్లిద్దరూ వైసీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవులు తమకు వస్తాయని ఆశించి మాత్రం విమర్శలు చేయరు. వీళ్లిద్దరూ జగన్ కు అత్యంత నమ్మకమైన నేతలు. జగన్ పై ఈగవాలినా ఊరుకునే రకం కాదు. అందుకే వైసీపీలో వీరిద్దరికీ ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

**పార్టీకి గుడ్ బై కొట్టనున్న ఆ ముగ్గురు**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి చాలామంది ఎమ్మెల్యేలు తెలుగుదేశం కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ జాబితాలో ఓ ముగ్గురు ఇప్పుడు తాజాగా చేరారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీకి టచ్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నారా లోకేష్ తో మాట్లాడినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా చర్చకు దారితీస్తోంది. అసలు టిడిపికి టచ్ లోకి ఎవరు వచ్చారు. టిడిపి వారిని తీసుకుంటుందా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ ఏదో జరుగుతోందన్న అనుమానాలు మాత్రం బలపడుతున్నాయి. ఒకరిద్దరూ టిడిపి ఎమ్మెల్యేల విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. స్థానిక పరిస్థితుల దృష్ట్యా వారు లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. అటువంటి వివాదాస్పద ఎమ్మెల్యేలకు వైసీపీ టచ్ లోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వారు వైసీపీలోకి వెళ్లిన మరుక్షణం.. వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలను లాగేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో రాయలసీమ నుంచి ఏడుగురు ఉన్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఓ ఇద్దరు గెలిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మరో ఇద్దరు ఉన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, బాల నాగిరెడ్డి, టి చంద్రశేఖర్, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ దాసరి సుధా, విశ్వేశ్వర రాజు, మత్స్యలింగం, అమర్నాథ్ రెడ్డి, విరూపాక్ష తదితరులు ఉన్నారు. అయితే ఇందులో రిజర్వుడు నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు అధికం. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో అసెంబ్లీకి హాజరు కావడం లేదు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇందులో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు ఈ నిర్ణయంతో విభేదిస్తున్నారు. వారంతా అసెంబ్లీకి వెళ్లాలని ఎక్కువగా కోరుకుంటున్నారు. కానీ ఆ కోరిక తీరడం లేదు.మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితులు కనిపించడం లేదు. కూటమి దూకుడుగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారం అందుతుంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉండడం కంటే కూటమిలో చేరడం ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చిన వారు ఉన్నారు. ప్రధానంగా ఓ ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు కూటమితో పాటు మంత్రి నారా లోకేష్ కు టచ్ లోకి వెళ్లినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. టిడిపిలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఎమ్మెల్యే పార్టీపై అసంతృప్తిగా ఉన్నారు. వైసిపి కి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఓ నేత సైతం అక్కడి ఎంపీ తో తీవ్రంగా విభేదిస్తున్నారు. ఆయన సైతం వైసీపీకి దగ్గరవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఆ ఎమ్మెల్యేలు కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలు.. కూటమి వైపు రావడం ఖాయం అన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే ఒక సంచలనమే.



## తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

కుటుంబాలకు జీవనాధారంగా ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్ ధరలు కుప్పకూలడంతో మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోళ్లకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు లేఖలో వెల్లడించారు. కిలోకు అదనంగా రూ.4 చొప్పున మామిడి రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం కింద కేంద్రం మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను అమలు చేసేలా చూడాలని చంద్రబాబు కోరారు.

## సంతానం భారం కాదు, సంపద

-మొదటిపేజీ తరువాయి

తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు.

పిల్లలను ఎత్తుకుని చంద్రబాబు కొంతసేపు ఆడించారు. వారి ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులుతో సీఎం మాట్లాడారు. పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళ్తున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు.

ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చిన్నారుల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని గుర్తుచేశారు. వారిని విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని చంద్రబాబు తెలిపారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని చెప్పారు. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని వెల్లడించారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

## జనసంద్రమైన స్వర్ణాల చెరువు

నెల్లూరు స్వర్ణాల చెరువు మూడోరోజూ భక్త జనసంద్రంగా మారింది. కీలక ఘటమైన గంధమహోత్సవం శనివారం అర్ధరాత్రి జరగ్గా జనం పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దర్గాకు వచ్చే దారులన్నీ రద్దీగా మారాయి. ఇవాళ సెలవు దినం కావడంతో బారాషాహీదుల దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఉద్యోగం, సంతానం, వివాహం రొట్టెలకు డిమాండ్ ఏర్పడింది. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. నెల్లూరు బారాషాహీద్ దర్గా రొట్టెల పండగకు పలువురు ఎమ్మెల్యేలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలో బారాషాహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని కోరుతూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దంపతులు రొట్టె వదిలారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ మరో రొట్టె పట్టుకున్నారు. 2029లో తన తమ్ముడు గిరిధర్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని కోరుతూ రొట్టె వదిలినట్లు ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి తెలిపారు. బారాషాహిద్ దర్గా వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కొనియాడారు.

కోర్కెలు నెరవేరాలని

సంతానం కోసం, ఉన్నత చదువులు, గృహం కోసం ఇలా తమ కోర్కెలు నెరవేరాలని భక్తులు స్వర్ణాల చెరువు దగ్గరికి వస్తారు. చెరువులో స్నానం చేసి తమ కోరికలు తీర్చమని దేవుళ్లని వేడుకుంటారు. మరోవైపు కోరిక తీరిన వారు అందుకు గుర్తుగా రొట్టెలు తెచ్చి పంచిపెడతారు. ఆ రొట్టె అందుకున్న వారు తిరిగి తమ కోర్కెలు నెరవేరాక మళ్లీ రొట్టెలను పంచుతారు. ఈ ఆచారం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది.

రొట్టె తీసుకోవడం ఆనవాయితీ : సంపద కావాలనుకునే వారికి ఒక రొట్టె, చదువు, ఉద్యోగం, సొంత ఇల్లు, ఆరోగ్యం, వివాహం, ఇలా ఎవరి కోరికలకనుగుణంగా వారు ఇక్కడ రొట్టె తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఒక ఏడాది ఇక్కడకు వచ్చి రొట్టె తీసుకొని కోరిక తీరిన తర్వాత కచ్చితంగా వచ్చి మళ్లీ రొట్టె విడిచి వెళ్లాలన్నది ఆచారం. అదేవిధంగా బారాషాహీద్‌లకు గలేఫ్‌లు, పూల చద్దర్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

దర్గా పరిసర ప్రాంతాలు, ఘాట్లలో, పార్కింగ్ ప్రదేశాల్లో శానిటేషన్?కు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు కంట్రోల్ రూమ్?ను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు సులువుగా గుర్తించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్వర్ణాల చెరువులో సోమశిల నుంచి నీటిని పెంచారు. రోజుకు మూడు సార్లు బ్లీచింగ్, నీటిలో క్లోరినేషన్ చేస్తున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన వైద్య బృందాలు, 108 అంబులెన్స్?లను అందుబాటులో ఉంచారు. నెల్లూరు రైల్వేస్టేషన్, బస్?స్టేషన్?ల నుంచి స్వర్ణాల చెరువుకు వచ్చేందుకు బస్ ?సర్వీసులను నడుపుతున్నారు.

జల్లు స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు : రొట్టెల పండుగకు వచ్చే భక్తులు జిల్లాలోని కసుమూరు, ఏఎస్ పేట దర్గాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో శానిటేషన్, త్రాగునీటి సౌకర్యం కల్పించారు. రొట్టెల పండుగకు వచ్చే మహిళలు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరిశుభ్ర వాతావరణంలో స్నానాలకు టెంట్?లు ఏర్పాటు చేశారు. జల్లు స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

## భీమిలి నుంచి తేజస్విని

**విశాఖపట్టణం :** భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్పాటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది. చివరి నిముషంలో ఆయన టెక్కలికి వెళ్ళారు. ఇక 2019 ఎన్నికల సమయంలో

# ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు శంకుస్థాపన చేసిన మంత్రులు జనార్ధన్ రెడ్డి, అనిత.

- ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరైన ఫిష్ ల్యాండిండ్ సెంటర్.
- 2 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు పై మంత్రులకు ధన్యవాధాలు తెలిపిన స్థానిక మత్స్యకారులు.







**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 28:** అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం లోని, దొండవాక, రాజయ్యపేట (చందనాడ) తీరాల్లో నిర్మించనున్న 2 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలకు బోయపాడులో శంకుస్థాపన చేసిన ఇరువురు మంత్రులు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద మంజూరై ఒక్కొక్కటి రూ. 24.77 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఫిష్ ల్యాండిండ్ సెంటర్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మంత్రులు. ఇవి

స్థానికంగా మత్స్యకారుల అభివృద్ధి ఑ ఆధునిక మౌలిక వసతుల లక్ష్యంగా సురక్షిత మైన బోటు ల్యాండింగ్, పరిశు భ్ర మైన పద్ధతిలో చేపల నిర్వహణ, మార్కెటింగ్ సదుపాయాలను కల్పనకు ఉపయోగపడనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు. కార్యక్రమంలో పెట్టు బడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని, వేలాదిమంది మత్స్యకార కుటుంబాలకు ఈ జెట్టిలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్లు ఎప్పుడైనా అభివృద్ధి గురించి ఆలోచించారా అన్నారు. నేడు అభివృద్ధిని చూసి ఓర్వలేక, విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. గత పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, రాజధాని అభివృద్ధి పనులకు అడ్డు తగులుతున్నారని చెప్పారు. హోం మంత్రి అనిత, ప్రజల మనసు దోచుకున్న నాయకురాలని, అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసమే తపిస్తారని తెలిపారు. అనంతరం

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాం అన్నారు.

కొన్ని సంవత్సరాలుగా స్థానిక మత్స్యకార సోదరులు జెట్టి కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్రంలో 3 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు వస్తే, పాయకరావుపేట నియోజకవర్గానికి 2 తీసుకువచ్చామని పేర్కొన్నారు. నా నియోజకవర్గంలో మత్స్యకార సోదరులకు, నాకు ఎంతో గొప్ప అనుబంధం ఉందని, నేను మత్స్యకార గ్రామం లోనే టీచర్ గా పని చేశానన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. 2 సంవత్సరాల కాలంలో సుమారు రూ. 600 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం. ఆర్ ఑ బి శాఖ ద్వారా రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాజయ్యపేట గ్రామ ప్రజలు నన్ను అడ్డుకున్నప్పుడు, ఏ ఒక్కరి మీద కూడా కేసు పెట్టవద్దని చెప్పానని, ఎన్నికల వరకే పార్టీలు, ఎన్నికలు తర్వాత అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమన్నారు.బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ ను కూడా తీసుకువచ్చాం. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో తొమ్మిది వేల కుటుంబాలు మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం మత్స్యకారులకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది.మత్స్యకార గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి కేతన్ గార్గ్.




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 28:**దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో -- 2026 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన జీవీఎంసీ సౌత్ జోనల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ బూత్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ తో కలిసి సందర్శించి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడిన కమిషనర్, 0 నుండి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని , పోలియో చుక్కలు చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ తో పాటు ఆరోగ్యవంత మైన భావితరాలకు మనందరి బాధ్యత అని సూచించారు. పోలియో వ్యాధి నుంచి శాశ్వత రక్షణ కల్పించడంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, గతంలో పోలియో టీకాలు తీసుకున్నప్పటికీ ఈ ప్రత్యేక కార్యక్రమంలో మళ్లీ పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని కమిషనర్ తెలిపారు.

జీవీఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన అన్ని పల్స్ పోలియో బూత్ లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఏ చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అలాగే బూత్‌కు రాలేని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలు సేవలు అందిస్తాయని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం .



లక్ష్మీనృసింహస్వామి ని దర్శించుకున్న న్యాయమూర్తి మనోజ్ కుమార్ ఓరి.



**సింహాచలం, పెన్ సత్తా, జూన్ 28:**ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి మనోజ్ కుమార్ ఓరి ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె. తిరుమలేశ్వరావు సాదర స్వాగతం పలికారు. దర్శనంలో భాగంగా జస్టిస్ మనోజ్ కుమార్ ఓరి ముందుగా ఆలయ విశిష్టత కలిగిన 'కప్పస్తంభాన్ని' ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న న్యాయమూర్తికి, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తిని శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు రెండు చుక్కల పోలియో మందు సవిత





**విజయవాడ, పెన్ సత్తా, జూన్ 28:** మధురానగర్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మంత్రి సవిత చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు, నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ రమణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రెండు పోలియో చుక్కలు ప్రతి చిన్నారి నిండు జీవితానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల లోపు చిన్నారుల కోసం రూ.6.20 కోట్ల వ్యయంతో 68.67 లక్షల పోలియో డోసులను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 1,31,298 మంది సిబ్బంది సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు అన్ని జిల్లాల్లో 29,873 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వార్డులు, ఆసుపత్రుల్లో కూడా పోలియో చుక్కలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం.

- ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి.
- ఎన్ టి ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో చుక్కలు వేసిన జిల్లా కలెక్టర్.





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 28** : ఎన్ టి ఆర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో నిర్మూలనలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మొదటి రోజైన జూన్ 28 న పోలియో కేంద్రాల వద్ద 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని , జూన్ 29, 30 తేదీల్లో హెల్త్ స్టాఫ్ ఇంటింటా తిరిగి, మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో డా. ఎమ్. హైమావతి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, డా. కె. చంద్ర శేఖర్ దేవ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డా. జె. నరసింగ రావు జిల్లా పరిశీలకులు, డా. కృష్ణారావు, డిసిహెచ్ఎస్, ఏ. రామచంద్ర రావు, గణాంకాల అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జేష్ఠ పౌర్ణమి నాడు ఎరూవాక పౌర్ణమి ప్రారంభం.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 28:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగం సాంప్రదాయాలకు అనుగుణంగా రేపు జేష్ఠ పౌర్ణమి నాడు ఎరూవాక పౌర్ణమి జరుపుకోమని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా నందు 29 సోమవారం న కసింకోట మండలం బయ్యవరం గ్రామం నందు ఏరువాక పౌర్ణమి జిల్లా కార్యక్రమం జరపడానికి నిర్ణయించారు. కావున ఉదయం 8 గంటలకి ఈ కార్యక్రమం బయ్యవరం నందు జరుపబడును ఈ కార్యక్రమంలో అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.ఆశా దేవి ఇతర జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రైతులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలియజేయడ మైనది.

## పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు..

77 మందికి రూ.44 లక్షల విలువైన చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు.



**కొత్తపేట, పెన్ సత్తా, జూన్ 28:**నిరంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఆదివారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తపేట మండలానికి చెందిన 77 మందికి రూ.44 లక్షల 82 వేల రూపాయల విలువైన చెక్కులను (4 ఎల్వోసీలు) అందజేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి చేస్తూ పేదల పక్షంగానే ఉంటుందన్నారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబు ఎప్పుడు పేద ప్రజల కోసమే ఆరాటపడతారన్నారు. మిగిలిన మూడు మండలాలకు చెందిన వారికి సోమ, మంగళ, బుధవారాల్లో చెక్కులు అందిస్తామని తెలిపారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.





**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 28:**విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ 34 వ వార్డు పరిధిలో మనోరమ థియేటర్ సమీపం లోని యూపీహెచ్సీలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం 27 వ వార్డు పరిధిలో దొండపర్తి రామాలయం వద్ద గల యూపీహెచ్సీలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## కదిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో సంద్రా కలప దందా పై కలెక్టర్ కు ఫిర్యాదు.

సమగ్ర విచారణకు కలెక్టర్ హామీ



**సత్యసాయి, పెన్ సత్తా, జూన్ 28**: జిల్లా కలెక్టర్ ని పర్యావరణవేత్తలు హరిలాల్ నాయక్, రంజిత్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి కదిరి ప్రాంతం లోని రిజర్వ్ ఫారెస్ట్‌లో జరుగుతున్న సంద్రా కలప అక్రమ నరికివేత పై ఫిర్యాదు చేశారు. వారి వివరాల ప్రకారం, కదిరి అటవీ ప్రాంతంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండానే కొంత మంది వ్యక్తులు ఫారెస్ట్ అధికారుల, ముఖ్యంగా రేంజర్ స్థాయి అధికారుల అండదండలతో సంద్రా కలప అక్రమ రవాణా, వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది కాలంగా వందలాది లారీల ద్వారా సంద్ర కలప తరలించబడుతూ అటవీ సంపదను భారీగా నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారులు అప్పుడప్పుడు కొంత కలపను సీజ్ చేశామని చెబుతున్నప్పటికీ, అసలు అక్రమ దందాను అరికట్టడంలో విఫలమయ్యారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ వ్యవహారంలో ఎవరు ప్రమేయం కలిగి ఉన్నారో పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ ని కోరారు.

ఈ విషయాన్ని శ్రద్ధగా విన్న జిల్లా కలెక్టర్, సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యావరణ పరి రక్షణలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని పర్యావరణవేత్తలు కోరారు.

## పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.





**జగ్గంపేట, పెన్ సత్తా, జూన్ 28:** రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసారి రెండు చుక్కలు పోలియో పై నిరంతరంగా విజయం అనే నినాదంతో ప్రతి ఐదు ఏళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. దేశాన్ని పోలియో రహితంగా ఉంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖా బుల్లి రాజు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, మాజీ సర్పంచ్ భూసాల విష్ణు, గనిశెట్టి సన్యాసి రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పూజ, మంచాల హేమాద్రి ప్రసాద్, బత్తుల స్వామి, చిదిరి శివ, కిలాని శివాజీ కూటమి నాయకులు, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పిల్లలకు జీవామృతం పోలియో చుక్కలు బొండా.





వార్డులో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్).

**గాజువాక, పెన్ సత్తా, జూన్ 28:**పల్స్ పోలియో చుక్కలు ఐదు సంవత్సరాలలో పిల్లలకు తప్పనిసరిగా వేయించాలి అని వార్డ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో 22 కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా వడ్లపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వడ్లపూడి రామాలయం, కణితి ప్రాథమిక పాఠశాల, అప్పికొండ, దానప్పతల్లి గుడి, లక్ష్మీపురం, అప్పికొండ ప్రాథమిక పాఠశాల, గాంధీ బొమ్మ జంక్షన్ జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియోరహిత సమాజం సాధ్యపడుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు, బిజెపి జిల్లా నాయకులు లక్కరాజు సోమరాజు, జనసేన వార్డు అధ్యక్షులు సిరసపల్లి కనకరాజు, డివి అప్పారావు, వై భాస్కరరావు, జాన్ రమేష్,కనకరాజు, మింది రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పక్కాగా చేపట్టండి.

క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.


**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 28:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా సేకరిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను అత్యంత కచ్చితత్వంతో, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఫారాన్ని నిశితంగా పరిశీలించి డిజిటలైజ్ చేయాలని సూచించారు. హెల్ప్ డెస్కుల ద్వారా ఓటర్లకు నాణ్యమైన సేవలను అందించాలని, వారి సందేహాలను నివృత్తి చేసి సహకరించాలని ఆదేశించారు.

ఆదివారం ఉదయం కలెక్టర్ బాలయ్య శాస్త్రి లేఅవుట్ లోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలు, ఇతర అధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అంశాల పై ఆరా తీశారు. అనంతరం సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను, హెల్ప్ డెస్కుల నిర్వహణ తీరును పరిశీలించారు. సాంకేతిక సిబ్బంది నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించి, నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్‌ను మరింత వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జోనల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి బీఎల్వోలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ఫారాలను ఎలాంటి ఆలస్యం లేకుండా డిజిటలైజ్ చేసి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంచాలని, క్షేత్రస్థాయిలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది, స్థానిక బూత్ స్థాయి ఏజెంట్ల సహకారాన్ని సమర్థంగా వినియోగించు కోవాలని సూచించారు.



మరణించిన వారు, వలస వెళ్లిన వారు, తప్పుగా నమోదైన ఓటర్లు, తొలగించాల్సిన ఓట్లు, ఇతర పోలింగ్ కేంద్రాలకు మారిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, గడువులోగా



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, సంబంధిత నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

# పీవీ జయంతి, వర్ధంతి ని అధికారికంగా జరపాలి జివిఎల్.







- దేశం విడిచిన మేధావులు తిరిగి భారత్ కు రావాలి ఎంపీ భరత్.
- విశాఖ లో బ్రాహ్మణా సంఘాలచే ఘనంగా పీవీ 105 జయంతి వేడుకలు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 28:** ప్రపంచ స్థాయిలో భారత కీర్తిపతాకను ఉన్నతంగా నిలిపి భారత మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహా రావు జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారంగా జరపాలని మాజీ ఎంపీ జివిఎల్ నరసింహా రావు పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖ లోని అఖిల బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నిర్వహణలో పీవీ 105 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరం లోని లోక్ సభ సభ్యులు ఎం. శ్రీ భరత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్ ( బీజీపీ), బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ( వైఎస్సార్ కాంగ్రెస్), పివి కి ఎస్ డి ఓ గా ఆరేళ్ళు పనిచేసిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జివిఎల్ మాట్లాడుతూ తానూ పీవీ ని ప్రత్యక్షంగా ఒక్కసారే కలిసినట్టు తెలిపారు. అయితే భారత ప్రధానమంత్రి గాను, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గానూ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చేసిన ఏకైక తెలుగు వ్యక్తి పీవీ అన్నారు. ఈయన దేశానికి చేసిన సేవలకు గుర్తింపు గాను ఆయనకు భారత రత్న పురస్కారం ఇచ్చి గౌరవించిన ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ మాత్రమే నన్నారు. రాజకీయంగా బద్ద విరోదంగా ఉన్నప్పుడికి వారికి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందించడం జరిగిందన్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా ఈ భారత దేశ గతిని పూర్తిగా మారేశారన్నారు.

ఒక వ్యక్తి మాతృ భాష కాకుండా మరొక భాష నేర్చుకోవడమే అత్యంత కష్టతరమని, అలాంటిది పీవీ ఏకంగా 16 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన నేర్పరి అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయినా పీవీ నేటి తరానికి మార్గదర్శి అన్నారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ పీవీ ప్రభుత్వానికి ముందు ఉన్న ఆర్థిక విపత్తుల ఫలితంగా విదేశాలకు వెళ్ళిపోయిన మేధావులు ( మేధో మధనం ) భారత్ కు తిరిగి రావాలి ని పిలుపునిచ్చారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ప్రపంచం మెచ్చిన ఆర్థిక సంస్కరణల మేధావిగా ఎదిగిన పీవీ స్ఫూర్తిగా నేటి యువతరం ఎదగాలని, తద్వారా భారత్ ప్రపంచంలోనే అత్యంత పటిష్ట మైన స్థితికి చేరుకుంటుందన్నారు.

కార్యక్రమానికి ముందుగా పీవీ నరసింహారావు వద్ద ప్రత్యేక అధికారిగా ఆరేళ్ళు పనిచేసిన ప్రసాద్ పీవీ జీవన శైలి, ఆలోచన, కార్యాచరణ విధానాలని వివరించారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారి వాజపేయి, అద్వానీ, ఇతర ముఖ్య నేతలు అందరితోనూ స్నేహ పూర్వక అనుబంధాన్ని కొనసాగించారని తెలిపారు. తన సొంత భూమి 80 ఎకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించిన ధీశాలి పీవీ అని తెలిపారు.

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్ ( బీజీపీ), బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ( వైఎస్సార్ కాంగ్రెస్) తదితరులు పీవీ ఈ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. వారిని కొనియాడడంతో పాటు, వారిని స్ఫూర్తిగా తీసుకుని దేశ సేవ చెయ్యాలని పిలుపునిచ్చారు. అనంతరం పీవీ విగ్రహానికి సంయుక్తంగా ఘన నివాళి అర్పించారు. అంతకు ముందు సిరిపురం లోని సర్క్యూట్ హౌస్ కూడలి వద్దగల పీవీ విగ్రహానికి ఎంపీ భరత్, మాజీ ఎంపీ జివిఎల్ నరసింహారావు, గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావులు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ లు సంయుక్తం గా భారీ పూలమాల వేసి, ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు కావూరి చరణ్ కుమార్, పీవీ జయంతి వేడుకల కమిటీ చైర్మన్ కె నరసింహ మూర్తి, వైజాగ్ బ్రాహ్మణ జె ఏ సి కన్వీనర్ కిరణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈ వేడుకలు ప్రముఖ న్యాయవాది కె. నరసింహ మూర్తి అధ్యక్షతన జరిగాయి. విశాఖ నగరం లోని అన్ని బ్రాహ్మణ సంఘాలు, అర్చక పురోహిత, మీడియా వర్గాలు, యువజన సంఘాలు, తదితర ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో పీవీ జయంతి వేడుకలను విజయవంతంగా జరిగినట్టు నిర్వాహక కమిటీ తెలియచేసింది. ఈ వేడుకల్లో విశాఖ లోని వివిధ బ్రాహ్మణా సంఘాల కుటుంబ సభ్యులు, పీవీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి.

మాజీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు.

**పరవాడ, పెన్ సత్తా, జూన్ 28:**ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని
ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు ప్రజలకు సూచించారు. మండలం లోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత ముత్యాలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రపంచ వ్యాప్తంగా పోలియో అంటే పెద్ద వ్యాధిగా భావించి ప్రజలు భయపడేవారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి ఫలితంగా పోలియో మహమ్మారి అంతమైందని చెప్పారు. పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి రత్నం, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాల రావు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



- 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

**అనంతపురం పెన్ సత్తా, జూన్ 28:**:పోలియో రహిత సమాజమే లక్ష్యంగా సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం కమలానగర్ లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని కొంతమంది చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పిల్లలకు వేయించే ఈ రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా జీవితాం
తం రక్షిస్తాయన్నారు. భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర వైద్యారోగ్య శాఖలు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రాణాంతక వ్యాధి నుండి శాశ్వత రక్షణను అందించడానికి ప్రత్యేక పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.పోలియోను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసే విధంగా కార్యక్రమం నిర్వహణకు ముందస్తు చర్యలు తీసుకొని సిబ్బందికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 16 23 పోలింగ్ బూతులలో సుమారు 2, 83,430మంది పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రధాన కూడళ్లు బస్టాండ్లు ,రైల్వేస్టేషన్, స్థానిక ప్రాథమిక కేంద్రాలు అంగన్వాడీలు మరియు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ, పట్టణ శివారు తదితర ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా పోలియో టీకాలు వేయడం జరుగుతున్నదన్నారు. దాదాపు 200 దేశాలలో పోలియో పూర్తిగా నిర్మూలించబడిందని అయితే ఒకటి లేదా రెండు దేశాల్లో ఇప్పటికీ ఈ వైరస్ ఉండడం వల్ల ప్రపంచం మొత్తం పోలియో రహితంగా మారే వరకు నిరంతర అప్రమత్తత, టీకాల పంపిణీ అవసరమని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలు అంగవైక ల్యాలకు గురికాకుండాకాపాడే విధంగా పల్స్ పోలియో బాధ్యతగా కార్యక్రమాలలో పాల్గొని విజయంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న వారు విధి నిర్వహణలో భాగంగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలోడా .శ్రావణి , మున్సిపల్ ఎంహెచ్ఓ సునీత, ఏఎస్ఓ ప్రవీణ్ కుమార్ హెచ్ ఈ ఓనాగలక్ష్మి, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు
- రాప్తాడు పి.హెచ్.సీలో పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే
- 5ఏళ్ల లోపు పిల్లలు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్న సునీత




**రాప్తాడు పెన్ సత్తా, జూన్ 28**పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అక్కడికి వచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులను ఆప్యాయంగా పలుకరించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఉదయాన్నే పోలియో చుక్కలు వేయించుకునేందుకు వచ్చిన వారందర్నీ అభినందించారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత సూచించారు. అక్కడక్కడ కొందరు దీని పట్ల నిర్లక్ష్యం వహించడం వలన ఇంకా 100శాతం పోలియో నిర్మూలన సాధ్యం కాలేదన్నారు. అయితే ఆ లక్ష్యానికి దగ్గరగా ఉన్నామని.. నిండైన జీవితానికి రెండు చుక్కలు వేయించాలన్నారు. ఆదివారం రోజు పోలియో చుక్కలు వేయించుకోని వారికి సోమ, మంగళ వారాల్లో కూడా ఆశా వర్కర్లు, అంగన్వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరూ ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**గోరంట్ల, , పెన్ సత్తా, జూన్ 28**పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి పాల్గొని 0-5 సంవత్సరల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఆమె మాట్లాడుతు "ప్రతి చిన్నారి ఆరోగ్యమే మన రాష్ట్ర భవిష్యత్తు అని పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు విజయ వంతం చేయాలని అన్నారు.రెండు పోలియో చుక్కలు వేయించడం ద్వారా మన పిల్లల ఆరోగ్యమే మహా భాగ్యమని పోలియో మహమ్మారి నుండి చిన్నారులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు వృషభ దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ పరిగి వేణుగోపాల్ రావుకు ఘన సన్మానం



**హిందూపురం, , పెన్ సత్తా, జూన్ 28** బిజెపి నాయకులు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ పరిగి వేణుగోపాల్ రావు ఇటీవల ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తరుణంలో మండల వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు పార్టీ శ్రేణులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక పరంగా ఆలయ సేవలు అందించడానికి ఎన్డీయే ప్రభుత్వం జిల్లా మంత్రులు ఎంపీ ఎమ్మెల్యేలు తనకు ఈ అవకాశం కల్పించారని ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. జూలై 7న శృంగేరి పీఠాధిపతి లేపాక్షి ఆలయానికి రానున్నారని కాబట్టి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మూర్తి చంద్రశేఖర్ రెడ్డి అనురాధ బద్రీనాథ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నా పిలుపుతో బంగారం కొనుగోళ్లు తగ్గించారు

పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల సమయంలో తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. తన పిలుపులను కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజలను బంగారం కొనుగోళ్లు తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని నియంత్రించాలని చేసిన విజ్ఞప్తులకు దేశ ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆదివారం ప్రసారమైన 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్ సాధించిన పలు కీలక విజయాలను ప్రస్తావించారు. 'ప్రజలు తమ రోజువారీ జీవితంలో చేసిన చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతున్నాయి. బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న నా పిలుపును ప్రజలు అనుసరించారు. అనేక కుటుంబాలు ఈసారి పెళ్లిళ్ల కోసం కొత్త బంగారం కొనుగోలు చేయకూడదని నిర్ణయించుకున్నాయి. అవసరం అయితే పాత బంగారాన్ని రీసైకిల్ చేసి కొత్త ఆభరణాలు తయారు చేసుకుంటున్నారు. ఇది బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్ణయం. అలాగే ప్రజలు ఈ సమయంలో విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కార్‌పూలింగ్, ఇంధన పొదుపు, విదేశీ ప్రయాణాల తగ్గింపు వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి మేలు చేస్తున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఇచ్చిన సూచనలకు ప్రజలు సహకరించడం దేశ ఐక్యతకు నిదర్శనం. ప్రజల భాగస్వామ్యంతోనే దేశం ఇలాంటి సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనగలదు' అని ప్రధాని మోదీ అన్నారు.



**దేశ భద్రత, స్వయం సమృద్ధిపై ప్రధాని మోదీ ప్రశంసలు**

దేశ భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్? వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. 2026 తొలి ఆరు నెలలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, ఈ కాలంలో భారత్ అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రక్షణ రంగంలో వచ్చిన పురోగతి దేశ ప్రజలందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత, బలమైన రక్షణ వ్యవస్థలతో భారత్ త్వరితగతిన ఆత్మనిర్భరత వైపు దూసుకుపోతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దేశంలో తయారైన సైనిక సాంకేతికత, స్వదేశీ ఉత్పత్తుల పెరుగుదలతో భారత్ మరింత శక్తివంతంగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. విమానయాన రంగంలోనూ భారత్ కీలక విజయాన్ని సాధించిందని తెలిపారు. స్వదేశీ సి-295 సైనిక రవాణా విమానం తొలి విజయవంతమైన ప్రయాణం పూర్తి చేసిందని ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశంలోనే 40 విమానాలు తయారవుతున్నాయని, ఇది ఎంఎస్ఎంఈలు, ఏరోస్పేస్ రంగాలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని ఆయన వివరించారు. అలాగే ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం మరింత బలపడుతోందని చెప్పారు. ఇక ఇటీవల జరిగి అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా 2,500కు పైగా ప్రదేశాల్లో వివిధ యోగా కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. వీటిలో కోట్లాది మంది ప్రజలు పాల్గొన్నారని చెప్పారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన 'ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్' గురించి కూడా పెద్ద ఎత్తున చర్చ జరిగిందని, ఇందులో భారత్ మొత్తం 114 పతకాలను (102 స్వర్ణ పతకాలతో సహా) గెలుచుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు.

**నలంద విశ్వవిద్యాలయంపై ప్రశంసలు**

నలంద విశ్వవిద్యాలయం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. భారతదేశ ప్రాచీన జ్ఞాన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన నలంద విశ్వవిద్యాలయం, ఆధునిక విద్యా వ్యవస్థతో పాటు పురాతన భారతీయ విలువలను సమన్వయం చేస్తూ కొత్త తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. రెండేళ్ల క్రితం నలంద విశ్వవిద్యాలయం నూతన ప్రాంగణాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించిందని గుర్తుచేసుకున్న ప్రధాని, ఈ సంస్థ భారతీయ ప్రాచీన 'శాస్త్రార్థ' సంప్రదాయాన్ని తిరిగి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం సాంకేతిక విప్లవం దిశగా వేగంగా పయనిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రోజూ కొత్త పరిశోధనలు, ఏఐ ఆవిష్కరణలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అయితే కొత్త సాంకేతికతను స్వీకరిస్తూనే మానవ సృజనాత్మకతను ఎలా కాపాడుకోవాలి? ఆధునికతతో ముందుకు సాగుతూనే మన మూలాలతో ఎలా అనుసంధానమై ఉండాలి? అనే ప్రశ్నలు ఈ కాలంలో అత్యంత ముఖ్యమైనవని ఆయన అన్నారు. దేశంలోని ఇతర ఉన్నత విద్యా సంస్థలు కూడా నాలందా విశ్వవిద్యాలయం తరహాలో ఇలాంటి కార్యక్రమాలను అమలు చేయాలని ప్రధాని సూచించారు.

# కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం!

త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గంలో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ఈనెల 23న ప్రధాని నరేంద్రమోదీ, 25న హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో సమావేశం కావడంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు జోరందుకున్నాయి. అవి మర్యాదపూర్వక భేటీలు అని చెబుతున్నప్పటికీ మంత్రివర్గ మార్పులపై చర్చ జరిగినట్లు భావిస్తున్నారు. సాధారణంగా జులై మూడోవారంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయి. దీంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కూడా జులైలో జరిగే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ బిజీ షెడ్యూల్ ఆధారంగా కేబినెట్ విస్తరణ తేదీని ఖరారు చేయనున్నారు.



**యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం**

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో కొత్త టీమ్‌ను ప్రకటించే సమయంలోనే కేంద్ర మంత్రివర్గంలోనూ మార్పులు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. యువ నేతలకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. కొందరు మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగించటంతోపాటు అలాగే పార్టీ బాధ్యతలు చూస్తున్న కొందరిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం. గతవారం కొందరు కేంద్ర సహాయమంత్రులతో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు జరిపారు. ఇప్పటికే ఇద్దరు కేంద్రమంత్రులు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రాకు ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

**వారు కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకునే అవకాశం**

ఇక, బీజేపీలో 'ఒక వ్యక్తికి ఒకే పదవి' నిబంధన ఉన్నందున వారు కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకునే అవకాశం ఉంది. కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టులను బీజేపీ రాజ్యసభకు తిరిగి నామినేట్ చేయలేదు. వారి పదవీకాలం జూన్ 21తో ముగిసింది. జార్జ్ కురియన్ ఇప్పటికే తన పదవికి రాజీనామా చేయగా, బిట్టు కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది జరిగే పంజాబ్ ఎన్నికలపై దృష్టి సారించాలని ఆయనకు సూచించనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆ రాష్ట్రాలకు మోదీ కేబినెట్‌లో ఎక్కువ ప్రాధాన్యం కల్పించే అవకాశం ఉంది.

**బంగాల్‌లో ఎంపీలకు మంత్రివర్గంలో అవకాశం!**

బంగాల్‌లో బీజేపీ ఘనవిజయం సాధించినందున అక్కడి ఎంపీలకు మంత్రివర్గంలో అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. అలాగే తృణమూల్ కాంగ్రెస్, శివసేన-యూబీటీ రెబల్ ఎంపీలకు కూడా స్థానం కల్పించవచ్చని సమాచారం. షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన యూబీటీ రెబల్ ఎంపీల్లో ఒకరికి క్యాబినెట్ హోదా దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీల్లో ఒకరిద్దరికి కూడా కేబినెట్ చోటు దక్కే సూచనలున్నాయి. అయితే, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటువేయాలని ఆయా పార్టీలు కోరుతున్నందున లోక్‌సభ స్పీకర్ తీసుకునే నిర్ణయంపై వారి మంత్రి పదవులు ఆధారపడి ఉంటాయి. అలాగే కొందరు మంత్రుల శాఖలు మారే అవకాశం ఉందని తెలుస్తోంది. 'నీట్' పేపర్ లీక్, జదీూజు డిజిటల్ మార్కింగ్ విధానంలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయనను పూర్తిగా కేబినెట్ నుంచి తప్పిస్తారా లేక వేరే శాఖకు మారుస్తారా అనేది కొన్నిరోజుల్లో తేలే అవకాశముంది. కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, దీ.నా.వర్మ పదవీకాలం నవంబర్‌లో ముగియనుండగా వారి విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. కొన్ని నెలల్లో కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ గవర్నర్లు థావర్ చంద్ గెహ్లోట్, మంగుభాయ్ పటేల్, లెఫ్టినెంట్ జనరల్ గురుమీత్ సింగ్ పదవీకాలం ముగియనుంది. దీంతో మంత్రివర్గం నుంచి తప్పుకోనున్న కొందరిని గవర్నర్లుగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇతరులపై నిందలు వేయడానికి బదులుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి

పాకిస్థాన్‌లోని కరాచీలో జరిగిన ఉగ్రదాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇతర దేశాలపై వేలెత్తి చూపే బదులు, పాకిస్థాన్ తన భూభాగంలో పెరిగిపోతున్న ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మీడియా ప్రశ్నలకు స్పందించిన రణధీర్ జైస్వాల్, కరాచీ ఘటనకు సంబంధించి భారత్‌పై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని స్పష్టం చేశారు. ఇతరులపై నిందలు వేయడం కంటే పాకిస్థాన్ తనలో తాను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ భూభాగంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించేందుకు విశ్వసనీయ చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంలో భాగంగా ఉపయోగించే ధోరణిని విడనాడాలని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి కరాచీలోని సింధ్ రేంజర్స్ భిట్టాయ్ వింగ్ ప్రధాన కార్యాలయంపై భారీ ఉగ్రదాడి జరిగింది. రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఆయుధాలతో వచ్చిన ఉగ్రవాదులు వాహనాన్ని ప్రధాన గేటుకు ఢీకొట్టి బలవంతంగా లోపలికి ప్రవేశించారు. అనంతరం గ్రెనేడ్లు విసురుతూ కాల్పులకు తెగబడ్డారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉగ్రవాదుల దాడికి రేంజర్స్ సిబ్బంది వెంటనే ప్రతిదాడి ప్రారంభించారు. అనంతరం స్పెషల్ సెక్యూరిటీ యూనిట్ (ఎస్ఎస్‌యూ), యాంటీ టెర్రరిస్ట్ ఫోర్స్ (ఏటీఎఫ్)



కమాండోలు రంగంలోకి దిగడంతో సుమారు 90 నిమిషాల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో గాయపడిన ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అయితే ఈ దాడిలో సింధ్ రేంజర్స్‌కు చెందిన నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఘటన అనంతరం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. కాల్పుల సమయంలో సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. ప్రజలను ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. ఈ దాడికి నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఈ సంస్థ ప్రధానంగా పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తూ భద్రతా బలగాలు, ప్రభుత్వ సంస్థలు, పౌరులపై దాడులకు పాల్పడుతోంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, దుండగులు వాహనంతో గేటును ఢీకొట్టి లోపలికి ప్రవేశించి గ్రెనేడ్లు విసిరినట్లు అధికారులు తెలిపారు. ఆ వెంటనే రేంజర్స్ సిబ్బంది అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపారని సింధ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జావేద్ ఆలమ్ ఒఢో వెల్లడించారు. ఘటన ప్రారంభంలో భారీ పేలుడు సంభవించినప్పటికీ, అది ఎలా జరిగిందన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఘటనపై సింధ్ ముఖ్యమంత్రి మురాద్ అలీ షా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దాడిపై సమగ్ర నివేదిక సమర్పించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రెస్క్యూ 1122 బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇది కరాచీలో గత అక్టోబర్ 2024 తర్వాత జరిగిన తొలి పెద్ద ఉగ్రదాడిగా అధికారులు చెబుతున్నారు. అంతకుముందు కరాచీ విమానాశ్రయం సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు చైనా ఇంజినీర్లు మరణించారు. ఆ దాడికి బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. ఇక టీటీపీ తరఫున కరాచీలో చివరిసారిగా 2023 ఫిబ్రవరిలో కరాచీ పోలీస్ కార్యాలయంపై దాడి జరిగింది. ఇటీవల పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం టీటీపీ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ తరచూ ఆరోపిస్తోంది. మరోవైపు టీటీపీ స్థావరాలపై అఫ్గాన్ భూభాగంలో పాకిస్థాన్ సైన్యం దాడులు కూడా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కరాచీ దాడి అనంతరం భారతపై పాకిస్థాన్ ఆరోపణలు చేయగా, వాటిని భారత్ పూర్తిగా తోసిపుచ్చి, ఉగ్రవాద సమస్యను ముందుగా తమ దేశంలోనే పరిష్కరించుకోవాలని స్పష్టమైన సందేశం ఇచ్చింది.

## సౌదీలో ఘోర ప్రమాదం..



సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా..



పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. కువైట్‌లోని అలీ అల్ సేలం ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని పోర్ట్ సల్మాన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధృవీకరించింది. ఒక రోజు క్రితం అమెరికా తమ భూభాగంలోని ఐదు ప్రాంతాలపై దాడులు జరిపిందని, దానికి ప్రతీకారంగానే ఈ చర్యలు తీసుకున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడటంతో అమెరికా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఈ దాడులు, ప్రతిదాడుల పరంపరతో ఇరు దేశాల మధ్య జూన్ 17న కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. కానీ, తాజా పరిణామాలతో శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ దాడులను కువైట్, బహ్రెయిన్ తీవ్రంగా ఖండించాయి. తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశాయి. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్వరంతో స్పందించారు. ఇరాన్ కనుక ఒప్పందాలను ఉల్లంఘిస్తూ దాడులకు పాల్పడితే, ఆ దేశం "ఇకపై ఉనికిలో ఉండదు" అని తీవ్రంగా హెచ్చరించారు. ఇరాన్ విదేశాంగ శాఖ మాత్రం అమెరికాయే ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. ఖతార్, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ దాడుల్లో అమెరికా సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే, బహ్రెయిన్‌లో ఓ నివాస భవనం దెబ్బతినడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ముంబై మొహర్రం ఊరేగింపులో భారీ కుట్ర భగ్నం...



ముంబై మహానగరంలో జరగాల్సిన ఓ పెను విషాదాన్ని పోలీసులు తమ అప్రమత్తతతో నివారించారు. మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకుని, వేలాది మంది ప్రాణాలు తీసేందుకు పన్నిన భారీ కుట్రను భగ్నం చేశారు. నొప్పి నివారణ (పెయిన్ కిల్లర్) మాత్రల నెపంతో ఎలుకల మందు నింపిన క్యాప్సూల్స్‌ను పంపిణీ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, దాదాపు 15,000 విషపు క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ముంబైలో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో మొహర్రం ఊరేగింపు ప్రశాంతంగా సాగుతోంది. ఈ క్రమంలో పుణెకు చెందిన ఫయాజ్ ప్రేమ్‌జీ (39) అనే పెయింట్ వ్యాపారి, ఊరేగింపులో పాల్గొంటున్న వారికి కొన్ని క్యాప్సూల్స్ పంపిణీ చేయడం ప్రారంభించాడు. అవి నొప్పి నివారణ మందులని నమ్మబలికాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు పంపిణీ చేస్తున్నవి సాధారణ మాత్రలు కావని, వాటిలో జింక్ ఫాస్ఫైడ్ అనే తీవ్రమైన విషపూరిత ఎలుకల మందు నింపి ఉందని గుర్తించారు. అతని వద్ద నుంచి సుమారు 14,900 విషపూరిత క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన క్రూరమైన పథకాన్ని అంగీకరించాడు. "నేను కనీసం 15,000 మందిని చంపాలనుకున్నాను" అని చెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ దారుణం కోసం నిందితుడు గత 15 రోజులుగా ముంబైలోనే ఉంటూ పథక రచన చేసినట్లు తేలింది. ఆన్‌లైన్ ద్వారా 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్, 30,000 ఖాళీ క్యాప్సూల్స్‌ను కొనుగోలు చేసి, వాటిలో విషాన్ని నింపినట్లు గుర్తించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో, నిందితుడు ఇచ్చిన క్యాప్సూల్ తీసుకున్న సల్మాన్ అనే వ్యక్తి వాంతులు, కడుపు నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఈ ఘటనకు, నిందితుడికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సత్వర స్పందనతో భారీ ప్రాణనష్టం తప్పిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్ జోన్-×) జయంత్ మీనా తెలిపారు. ఈ ఘటనలో స్వల్ప అస్వస్థతకు గురైన మరికొందరికి చికిత్స అందించగా, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. బైకుల్లా పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి ఏవైనా ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయా, అతని విదేశీ ప్రయాణాల వివరాలు, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు. మొహర్రం ఊరేగింపుల సందర్భంగా భారీ జనసందోహం ఉంటుందన్న ఉద్దేశంతోనే నిందితుడు ఈ దాడికి ప్రణాళిక రచించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనతో నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# విటమిన్ సి వల్ల అసలు మన శరీరానికి కలిగే ఉపయోగాలు ఏమిటి..?

మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో విటమిన్ సి కూడా ఒకటి. దీని వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అందరికీ తెలుసు. అయితే కేవలం ఇదే కాదు, ఇంకా అనేక రకాల పనులకు కూడా మనకు విటమిన్ సి అవసరం అవుతుంది. విటమిన్ సి మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది. ఇది కణజాలాలకు మరమ్మత్తులు చేస్తుంది. కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎంజైమ్‌ల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారేలా చేస్తుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా విటమిన్ సి మనకు ఎన్నో రకాలుగా ఉపయోగం పడుతుంది. ఇది నీటిలో కరిగే విటమిన్. కనుక శరీరం ఈ విటమిన్‌ను నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఈ విటమిన్‌ను మనం రోజూ తప్పనిసరిగా శరీరానికి అందించాల్సి ఉంటుంది.




**విటమిన్ సి లోపం ఉంటే..**

విటమిన్ సి లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. సాధారణంగా విటమిన్ సి ని మనం రోజూ మనుకు తెలియకుండానే తీసుకుంటాం. ఇది అనేక ఆహారాల్లో ఉంటుంది. కనుక విటమిన్ సి లోపం రాదు. కానీ కొందరు రోజూ ఒకేలాంటి ఆహారం తింటారు. అలాంటి వారితోపాటు మహిళల్లో విటమిన్ సి లోపం వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ లోపం ఉంటే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. శరీర మానసిక స్థితిలో సైతం మార్పులు వస్తాయి. బరువు తగ్గుతారు. కీళ్లు, కండరాల నొప్పులు ఉంటాయి. సులభంగా గాయాలు అవుతుంటాయి. పుండ్లు త్వరగా మానవు. దంతాలు, చిగుళ్ల సమస్యలు ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. జుట్టు బలహీనంగా మారి రాలిపోతుంది. జుట్టు చివర్లు చిట్లిపోతాయి. చర్మం పొడిబారి కాంతిహీనంగా కనిపిస్తుంది. ఇలా విటమిన్ సి లోపం ఉన్నవారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి.

**రోజుకు ఎంత కావాలి..?**

విటమిన్ సి ఉండే ఆహారాలను తీసుకుంటే హైబీపీ తగ్గుతుంది. మూత్ర విసర్జన సాఫీగా అవుతుంది. మూత్రాశయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. రక్త నాళాల గోడలపై పడే ఒత్తిడి తగ్గుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. విటమిన్ సి వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి అవుతుంది. ఇది చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. మన శరీరం మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను సరిగ్గా శోషించుకోవాలంటే అందుకు విటమిన్ సి అవసరం అవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు నియంత్రణలో ఉండాలంటే విటమిన్ సి అవసరం అవుతుంది. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలోనూ విటమిన్ సి పనిచేస్తుంది. ఇక విటమిన్ సి మనకు వయస్సును బట్టి నిర్దిష్టమైన మోతాదులో రోజూ అవసరం అవుతుంది. సాధారణంగా విటమిన్ సి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి అయితే రోజుకు 40 నుంచి 60 మిల్లీగ్రాములు అవసరం అవుతుంది. అదే 18 ఏళ్లకు పైబడిన వారికి అయితే రోజుకు 90 మిల్లీగ్రాములు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు రోజుకు 120 మిల్లీగ్రాముల విటమిన్ సి అవసరం అవుతుంది.

**వేటిని తినాలి..?**

విటమిన్ సి మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది. ఇది మనం రోజూ తినే కూరగాయలు, ఆకుకూరల్లో అధికంగా ఉంటుంది. అలాగే సిట్రస్ జాతికి చెందిన పండ్లను కూడా తినవచ్చు. నారింజ పండ్లు, నిమ్మ, ఉసిరి, గ్రేప్ ఫ్రూట్, ద్రాక్ష, కివి పండ్లు, క్యాప్సికం, టమాటా, వెల్లుల్లి, పైనాపిల్, బొప్పాయి, పచ్చి బఠానీలు, అరటి పండ్లు, యాపిల్, కొత్తిమీర, పుదీనా, క్యాబేజీ, బ్రోకలీ, కాలిఫ్లవర్ వంటి పండ్లు, కూరగాయలను అధికంగా తింటుంటే విటమిన్ సి ని పొందవచ్చు. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు.

# వికారంగా ఉంటూ వాంతులు వచ్చినట్లు అనిపిస్తుందా..?

## అయితే ఈ చిట్కాలను పాటించండి..!



వికారంగా ఉండడం లేదా వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి సమస్యలు సాధారణంగా మనకు అప్పుడప్పుడు వస్తుంటాయి. గర్భిణీలకు అయితే ఈ సమస్యలు సహజంగానే ఉంటాయి. కానీ వికారం, వాంతులు అనేవి కేవలం గర్భిణీలకే కాదు, అందరికీ అప్పుడప్పుడు వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. జీర్ణ సమస్యలు ఉన్నవారికి, ఫుడ్ పాయిజన్ అయినప్పుడు, ఫుడ్ అలర్జీలు ఉన్నవారు పడని ఆహారం తిన్నప్పుడు, కలుషితమైన ఆహారం లేదా ద్రవాలను తీసుకున్నప్పుడు, పలు రకాల మందులను వేసుకున్నప్పుడు, పలు ఇతర కారణాల వల్ల కూడా ఈ సమస్యలు వస్తుంటాయి. అయితే ఈ సమస్యల నుంచి బయట పడేందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో పదార్థాలతోనే సహజసిద్ధంగానే ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. అందుకు కొన్ని చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.

**అల్లం, పుదీనా రసం..**

వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి సమస్యలు ఉంటే అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి వికారం, వాంతులు తదితర సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. అల్లం రసం తీసుకోవడం వల్ల వికారం నుంచి బయట పడవచ్చు. వాంతులు అవకుండా అడ్డుకోవచ్చు. రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసం సేవిస్తుండాలి. దీని వల్ల ఆయా సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే పుదీనా ఆకుల రసాన్ని సేవించడం వల్ల కూడా ఎంతో ఉపశమనం లభిస్తుంది. పుదీనాలో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. ఇవి కడుపు నొప్పి, వాంతులు, వికారం సమస్యలను తగ్గిస్తాయి. పుదీనా ఆకుల రసాన్ని ఒక టీస్పూన్ చొప్పున రోజుకు 3 పూటలా భోజనం చేసిన అనంతరం సేవిస్తుండాలి. దీంతో ఆయా సమస్యలు తగ్గుతాయి.

**విటమిన్ బి6..**

విటమిన్ బి6 ఉన్న ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. విటమిన్ బి6 మనకు ఎక్కువగా చేపలు, చికెన్, కోడిగుడ్లు, సోయాబీన్, తృణ ధాన్యాలు, కూరగాయల్లో లభిస్తుంది. ఈ ఆహారాలను తీసుకుంటున్నా కూడా వాంతులు, వికారం సమస్యల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా గర్భిణీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇక మనం తరచూ ఉపయోగించే నిమ్మకాయలు కూడా ఈ సమస్యల నుంచి మనల్ని బయట పడేలా చేస్తాయి. నిమ్మకాయలను దగ్గర పెట్టుకుని ఎప్పుడూ వాసన పీలుస్తుండాలి. దీని వల్ల వికారం సమస్యను తగ్గించుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తాగుతున్నా కూడా సమస్యలు తగ్గుతాయి. ఇలా రోజుకు 3 సార్లు తాగవచ్చు.

**వీటిని తీసుకోవాలి..**

వాంతులు, వికారం వంటి సమస్యలు ఉన్నవారు అరటి పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. పుచ్చకాయలు, తర్బూజాలను కూడా తినవచ్చు. వీటి జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను సైతం తాగవచ్చు. ఇవి కూడా ఆయా సమస్యల నుంచి బయట పడేలా చేస్తాయి. ఇక ఈ సమస్యలు ఉన్నవారు నూనె పదార్థాలను తినకూడదు. కారం, మసాలాలు, ఘాటైన వాసన కలిగిన ఆహారాలు, తియ్యని పదార్థాలు, టీ, కాఫీ, మద్యం వంటి ఆహారాలు, పానీయాలను తీసుకోకూడదు. తిన్న వెంటనే నిద్రించకూడదు. కాసేపు వాకింగ్ చేస్తే మంచిది. ఒకేసారి అతిగా కాకుండా కొద్ది కొద్దిగా ఎక్కువ సార్లు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ చిట్కాలను పాటిస్తూ ఆహారాలను తీసుకుంటుంటే వాంతులు, వికారం సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు.



# జీడిపప్పుతో పాలను ఇలా తయారు చేసి రోజూ తాగండి..

జీడిపప్పును మనం తరచూ తింటూనే ఉంటాం. వీటిని తీపి పదార్థాల తయారీలో వాడుతారు. మసాలా వంటకాల్లోనూ జీడిపప్పును వేస్తుంటారు. దీని వల్ల వంటకాలకు చక్కని రంగు, రుచి వస్తాయి. జీడిపప్పును నేరుగా లేదా వేయించుకుని కూడా తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటుంది. అయితే ఈ పప్పును తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. కనుక రోజూ ఈ పప్పును గుప్పెడు మోతాదులో తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. అయితే జీడిపప్పును నేరుగా కాకుండా వీటితో పాలను తయారు చేసి కూడా తీసుకోవచ్చు. జీడిపప్పు పాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. అనేక పోషకాలను అందిస్తాయి. జీడిపప్పు పాలను రోజూ ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీడిపప్పును రోజూ నేరుగా తినలేమని అనుకునేవారు వీటితో పాలను తయారు చేసి రోజూ తాగితే ఎంతో లాభం ఉంటుందని అంటున్నారు.

**హైబీపీ ఉన్నవారికి..**

జీడిపప్పుల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. కనుక జీడిపప్పు పాలను రోజూ సేవిస్తుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీడిపప్పులో మెగ్నిషియం, పొటాషియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. జీడిపప్పులో మెగ్నిషియం, కాపర్, విటమిన్ కె, క్యాల్షియం, విటమిన్ డి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**కంటి ఆరోగ్యానికి..**

జీడిపప్పులో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటిలోని రెటీనాను రక్షిస్తాయి. దీని వల్ల కళ్లలోని కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. జీడిపప్పు పాలలో కాపర్ అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. జీడిపప్పు పాలలో జింక్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీని వల్ల సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. జీడిపప్పు పాలలో అధికంగా ఉండే ఐరన్, కాపర్ ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందేలా చేస్తాయి. దీంతో రక్తహీనత తగ్గుతుంది.

**ఇలా తయారు చేయాలి..**

ఇక జీడిపప్పు పాలను ఇంట్లోనే ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. బయట మార్కెట్‌లో లభించే జీడిపప్పు పాలను తాగాల్సిన పనిలేదు. జీడిపప్పు పాలను తయారు చేసేందుకు గాను 1 కప్పు జీడిపప్పు, 4 కప్పుల నీళ్లు, పప్పును నానబెట్టేందుకు మరి కొన్ని నీళ్లు, చిటికెడు సముద్రపు ఉప్పు, ఒక టీస్పూన్ తేనె (రుచి కోసం) తీసుకోవాలి. ముందుగా జీడిపప్పును నీటిలో వేసి రాత్రంతా నానబెట్టాలి. లేదా కనీసం 4 గంటలపాటు అయినా నానబెట్టాలి. తరువాత వాటిని తీసి 4 కప్పుల నీళ్లను పోసి అందులోనే ఉప్పు, తేనె వేసి కలిపి ఆ మిశ్రమాన్ని బ్లెండర్‌లో వేసి మెత్తగా పట్టుకోవాలి. దీంతో క్రీమ్ లాంటి మెత్తని పేస్ట్ లా ఉండే పాలు రెడీ అవుతాయి. అవసరం అనుకుంటే ఇంకొన్ని నీళ్లను కలుపుకోవచ్చు. ఇలా జీడిపప్పు పాలను తయారు చేసి గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ పాలను తాగవచ్చు. ఈ పాలను ఉదయం బ్రేక్ ఫాస్ట్ అనంతరం సేవిస్తే ఎంతో ఫలితం ఉంటుంది. ఇలా జీడిపప్పు పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## ఖేల్‌ఖతం.. పొట్టి కప్పులో ముగిసిన భారత అమ్మాయిల కథ



అవతల దక్షిణాఫ్రికా ఓడిపోలేదు. కానీ బంగ్లాదేశ్‌పై ఘనంగా ఏమీ గెలవలేదు. ఆస్ట్రేలియాను భారత్ కూడా మామూలుగా ఓడిస్తే చాలు.. సెమీస్ బెర్తు సొంతమవుతుంది. కానీ గెలవడానికి అవకాశం వచ్చినా.. భారత్ ఉపయోగించుకోలేకపోయింది. సఫారీలపై ఎలా అయితే బౌలింగ్‌లో మంచి ఆరంభం తర్వాత తడబడి మ్యాచ్‌ను దూరం చేసుకుందో, కంగారూతో పోరులోనూ ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో పేలవ బౌలింగ్, ఫీల్డింగ్‌తో మ్యాచ్‌ను అప్పగించేసింది హర్మన్‌ప్రీత్‌సేన. నిరుడు వన్డే ప్రపంచకప్ విజయంతో అత్యున్నత స్థాయిలో నిలిచిన భారత్.. పొట్టి కప్పులో గ్రూప్ దశలోనే నిష్క్రమించి నేలకు దిగిపోయింది.

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీస్ కూడా చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది హర్మన్‌ప్రీత్ సేన. నాకౌట్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఆదివారం భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మొదట భారత్ 4 వికెట్లకు 170 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ (56; 27 బంతుల్లో 6ఐ4, 3ఐ6) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా, షెఫాలి (34; 26 బంతుల్లో 3ఐ4, 2ఐ6) కూడా మెరిసినా.. స్మృతి మంధాన (38; 37 బంతుల్లో 6ఐ4), జెమీమా రోడ్రిగ్స్ (34; 28 బంతుల్లో 1ఐ4, 1ఐ6) మరీ నెమ్మదిగా ఆడడంతో భారత్ అవసరమైన దాని కంటే తక్కువ స్కోరే చేసింది. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెర్రీ (56; 38 బంతుల్లో 8ఐ4), ఆష్లీ గార్డ్‌నర్ (53 నాటౌట్; 29 బంతుల్లో 3ఐ4, 3ఐ6) మెరుపులతో లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్పిన్నర్ శ్రీ చరణి (2/32) మరోసారి మెరిసినా.. జట్టును గెలిపించలేకపోయింది. గ్రూప్‌-1 నుంచి ఆస్ట్రేలియా (10 పాయింట్లు), దక్షిణాఫ్రికా (8) సెమీస్ చేరాయి. గ్రూప్‌-2 నుంచి ఇంగ్లాండ్ (10), వెస్టిండీస్ (6) ముందంజ వేశాయి.

ఆశలు రేగినా..: లక్ష్యం మరీ పెద్దది కాకపోయినా.. భారత్ గెలవడానికి మంచి అవకాశాలే కనిపించాయి. ఛేదనలో ఆసీస్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. రెండో బంతికే జార్జియా వోల్ (4)ను రేణుక వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌కు శుభారంభాన్నిచ్చింది. అయితే బెత్ మూనీ (22), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (24) నిలవడంతో ఆసీస్ 54/1తో పుంజుకుంది. టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్న తెలుగమ్మాయి శ్రీ చరణి.. బంతి అందుకోగానే ఫలితం రాబట్టి భారత్‌ను పోటీలోకి తెచ్చింది. ప్రమాదకర లిచ్‌ఫీల్డ్‌ను ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఔట్ చేసింది. కాసేపటికే బెత్ మూనీని మరో స్పిన్నర్ దీప్తి ఔట్ చేయడంతో ఆసీస్ ఇబ్బందుల్లో పడింది. పిచ్ నెమ్మదిగా ఉండి, బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో స్పిన్నర్లు బాగా ఉపయోగించుకుని ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. 12 ఓవర్లకు స్కోరు 85/3. 8 ఓవర్లలో 86 పరుగులు చేయాల్సి రావడంతో భారత్‌కు మెరుగైన అవకాశాలున్నట్లే కనిపించింది. కానీ మేటి బ్యాటర్లయిన పెర్రీ, ఆష్లీ ఒత్తిడిని ఒక్కసారిగా భారత్ మీదికి మళ్లించేశారు. రాధ యాదవ్ వేసిన 13వ ఓవర్లో ఆష్లీ 4, 6 బాదగా.. పెర్రీ ఒక ఫోర్ కొట్టింది. ఈ ఓవర్లో 17 పరుగులు రావడంతో ఆసీస్ బలంగా పోటీలోకి వచ్చింది. 15 ఓవర్లో శ్రీ చరణి సైతం 16 పరుగులు సమర్పించుకోవడంతో సమీకరణం 30 బంతుల్లో 46 పరుగులతో అందుబాటులోకి వచ్చింది. రేణుక 17వ ఓవర్లో పేలవంగా బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చుకోవడంతో మ్యాచ్ భారత్ చేజారింది. ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ కూడా పేలవంగా సాగడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ చేతిలోకి వచ్చాక పెర్రీ ఔట్ కాగా.. 19వ ఓవర్ చివరి బంతికి ఫోర్ కొట్టిన జార్జియా మ్యాచ్‌ను ముగించింది.

కొంపముంచిన అతి జాగ్రత్త: అంతకుముందు బ్యాటర్ల అతి జాగ్రత్త భారత్‌ను దెబ్బ తీసింది. వికెట్లు కాపాడుకుంటూ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేయాలన్న ఉద్దేశంతో ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ ఆచితూచి ఆడారు. అయితే షెఫాలి కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించింది కానీ.. స్మృతి మాత్రం ఎంతకీ జోరందుకోలేకపోయింది. బంతికో పరుగు చొప్పున చేసిన ఆమె.. 12 ఓవర్లో రనౌటై వెనుదిరిగింది. అంతకంటే ముందు షెఫాలి ఔటైంది. ఆష్లీ గార్డ్‌నర్ బౌలింగ్‌లో 6, 4 బాది ఊపందుకున్న షెఫాలిని మోలనూ బౌల్డ్ చేసి భారత్‌ను గట్టి దెబ్బ తీసింది. ఆమె ఔటయ్యాక భారత ఇన్నింగ్స్‌లో మెరుపులు కరవయ్యాయి. జెమీమా షాట్లు ఆడడానికి ఆపసోపాలు పడింది. హర్మన్‌ప్రీత్ అప్పుడప్పుడూ బౌండరీలు కొడుతూ రన్‌రేట్ మరీ పడిపోకుండా చూసింది. 19 ఓవర్లో జెమీమా క్యాచ్‌ను బౌండరీ వద్ద వేర్‌హామ్ వదిలేయడంతో అది సిక్స్ అయింది. ఆ ఓవర్ తర్వాత ఆమె రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరగ్గా.. అప్పటికే చాలా ఆలస్యం అయింది. ఒక ఓవర్ మిగిలుండగా స్కోరు 147 మాత్రమే. అయితే మోలనూ వేసిన ఆఖరి ఓవర్లో హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదడం.. చివరి బంతికి దీప్తి ఫోర్ కొట్టడంతో మొత్తంగా 23 పరుగులు వచ్చాయి. స్కోరు 170కి చేరుకుంది.

## ఇదీ పోయె.. రెండో టీ20లోనూ భారత్ ఓటమి




శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కు పేలవ ఆరంభం. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా 0-2తో కోల్పోయింది. మరోసారి బ్యాటుతో విఫలమైన భారత్.. రెండో టీ20లోనూ పరాజయంపాలైంది. తిలక్ వర్మ పోరాటం వృథా అయింది. బ్యాటింగ్ వైఫల్యం కొనసాగిన వేళ ఐర్లాండ్‌తో చివరిదైన రెండో టీ20లో భారత్ ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. మొదట ఐర్లాండ్ 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. హ్యారీ టెక్టార్ (53; 47 బంతుల్లో 5ఐ4, 1ఐ6) రాణించాడు. అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ (3/22) ఆ జట్టు కట్టడిలో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ (2/35), శివమ్ దూబె (2/25), హర్షిత్ రాణా (1/17) రాణించారు. ఛేదనలో భారత్ 9 వికెట్లకు 153 పరుగులే చేయగలిగింది. తిలక్ వర్మ (55; 46 బంతుల్లో 3ఐ4, 1ఐ6) ఒక్కడే రాణించాడు. భారత సంతతి ఆటగాడు జై ముంద్రా (3/32), హోలార్డ్ (3/26) విజృంభించారు. ఈ విజయంతో సిరీస్‌ను ఐర్లాండ్ 2-0తో చేజిక్కించుకుంది. భారత్‌పై ఏ ఫార్మాట్లోనైనా సిరీస్ నెగ్గడం ఆ జట్టుకు ఇదే తొలిసారి. 16 వరుస టీ20 సిరీస్ విజయాల తర్వాత భారత్‌కిదే తొలి ఓటమి. ప్రిన్స్‌తో పాటు ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. వైభవ్‌కు అవకాశం దక్కలేదు.

భారత్ తడబాటు: ఛేదనలో భారత్ తడబడింది. విధ్వంసక ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి ఓవర్లోనే డకౌటవగా.. మూడో ఓవర్లో కెప్టెన్ శ్రేయస్ (10) వెనుదిరిగాడు. ఈ ముగ్గురిని జై ముంద్రా ఔట్ చేశాడు. 5వ ఓవర్లో ఇషాన్ కిషన్ (12) రనౌట్ కావడంతో 35/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో తిలక్ వర్మ నిలబడ్డాడు. అక్షర్ (14)తో 39 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దిన తిలక్.. అతడు ఔటయ్యాక దూబె (20)తో కలిసి పోరాటాన్ని కొనసాగించాడు. 16 ఓవర్లలో 109/5తో భారత్ రేసులో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్లో హంఫ్రీస్ 2 పరుగులే ఇచ్చి దూబెను ఔట్ చేయడం.. హోలార్డ్ ఒకే ఓవర్లో తిలక్, షెడ్జే (1)లను వెనక్కి పంపడంతో టీమ్‌ఇండియా వెనుకబడిపోయింది. 19వ ఓవర్లో హర్షిత్ (21) వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. ఆఖరి ఓవర్లో 20 పరుగులు అవసరమయ్యాయి. తొలి రెండు బంతుల్లో 9 పరుగులు రావడంతో ఆశలు రేగినా.. చివరికి ఓటమి తప్పలేదు. 2 బంతుల్లో 8 పరుగులు చేయాల్సిరాగా హర్షిత్ ఔటవగా.. చివరి బంతికి ప్రిన్స్ సిక్స్ కొట్టినా ఫలితం లేకపోయింది.

## హైదరాబాద్‌కు ఎదురుందా?

తెలంగాణ క్రికెట్ లీగ్ టీజీ20లో ఓటమి ఎరుగని ఏకైక జట్టు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్.. తన తర్వాతి పోరుకు సిద్ధమైంది. సోమవారం ఆ జట్టు.. అన్విత ఖమ్మం ఏసెస్‌ను ఢీకొనబోతోంది. హైదరాబాద్ హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదుండగా.. ఖమ్మం మూడు మ్యాచ్‌ల్లో రెండు నెగ్గి మెరుగైన స్థితిలోనే ఉంది. ఈ ఛాంపియన్స్ మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుగవుతూ దుర్భేద్యంగా మారుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో నిరాశపరిచిన ఓపెనర్ సాయివికాస్ రెడ్డి.. మూడో పోరులో 93 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్, మరో ఓపెనర్ అభిరథ్ రెడ్డిని ఆపడం ప్రత్యర్థులకు సవాలుగా మారింది. తొలి మ్యాచ్‌లో 35 పరుగులు చేసిన అతను.. తర్వాత వరుసగా 99, 59 పరుగులు సాధించాడు. మిడిలార్డర్లో గణేశ్ గడుగు ధాటిగా ఆడుతున్నాడు. అయితే ఈ ఛాంపియన్స్ మిడిలార్డర్‌కు ఇప్పటిదాకా పెద్ద పరీక్ష ఎదురు కాలేదు. ఒకవేళ టాప్‌ఆర్డర్ విఫలమైతే తర్వాతి బ్యాటర్లు ఏమేర బాధ్యత తీసుకుంటారన్నది చూడాలి. బౌలింగ్‌లో పేసర్ అజయ్ దేవ్ గౌడ్, స్పిన్నర్ ప్రణవ్ వర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. మరోసారి సమష్టి ప్రదర్శనతో నాలుగో విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసులో మరింత ముందుకు దూసుకెళ్లాలని హైదరాబాద్ ఆశిస్తోంది. నితిన్ నాయక్, శ్రీనికేత్ పర్వాలేదనిపిస్తున్నారు. ఖమ్మం జట్టుకు కూడా టాప్ ఆర్డరే అతి పెద్ద బలం. వాఫి కచ్చి, సాయికృష్ణ, హిమతేజ జోరుమీదున్నారు. బౌలింగ్‌లో కెప్టెన్ సీవీ మిలింద్, వేద్ రెడ్డి ఆ జట్టుకు కీలకం.

# సల్మాన్ సినిమాకు రాజమౌళి ఎలివేషన్



పాన్ ఇండియా.. గత దశాబ్ద కాలంగా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీని ఊపేస్తున్న ట్రెండ్. అంతకుముందెన్నడూ వినని ఈ పదాన్ని పాపులర్ చేసిన ఘనత 'బాహుబలి' సినిమా సొంతం. పేరుకు అది తెలుగు సినిమానే అయినా.. ఇండియా మొత్తం బాక్సాఫీస్‌ను షేక్ చేసేసింది. దాని బాటలో ఆ తర్వాత కేజీఎఫ్, పుష్ప, ఆర్ఆర్ఆర్, కాంతారా.. ఇలా మరెన్నో దక్షిణాది చిత్రాలు దేశవ్యాప్తంగా భారీ విజయాలనందుకున్నాయి. మణిరత్నం లాంటి గ్రేట్ డైరెక్టర్ తన డ్రీమ్ ప్రాజెక్టు 'పొన్నియన్ సెల్వన్'ను భారీ స్థాయిలో తీర్చిదిద్దడంలో తనకు రాజమౌళే స్ఫూర్తి అన్నారు. ఆయన మాత్రమే కాదు.. పాన్ ఇండియా ట్రెండ్ సృష్టికర్తగా రాజమౌళిని అందరూ కొనియాడుతూనే ఉంటారు. అలాంటి దర్శకుడు.. తనకు ఈ క్రెడిట్ ఇవ్వడం కరెక్ట్ కాదని ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించడం విశేషం.ఒక భాషకు చెందిన చిత్రం దేశమంతా బాగా ఆడడం 'బాహుబలి'తో మొదలైన ట్రెండ్ కాదని రాజమౌళి స్పష్టం చేశారు. 90వ దశకంలోనే సల్మాన్ ఖాన్ సినిమా 'మైనే ప్యార్ కియా' దక్షిణాదిన గొప్పగా ఆడిందని ఆయన గుర్తు చేశారు. తెలుగు, తమిళ భాషల్లో దాని డబ్బింగ్ వెర్షన్లు సూపర్ హిట్లు అయ్యాయని.. దేశంలో ప్రతి సినీ ప్రేక్షకుడూ అప్పట్లో ఆ సినిమ్ను చూశాదని రాజమౌళి కితాబిచ్చారు.ఐతే ఆ ట్రెండును తర్వాతి రోజుల్లో కొనసాగించలేకపోయారని.. అంతే తప్ప 'బాహుబలి'తోనే పాన్ ఇండియా ట్రెండ్ మొదలైందని అనడం కరెక్ట్ కాదని రాజమౌళి వినమ్రంగా చెప్పారు. ఇలా ఎవరికి ఇవ్వాల్సిన క్రెడిట్ వాళ్లకు ఇవ్వడంలోనే రాజమౌళి ప్రత్యేకత దాగి ఉంది. రాజమౌళి పేరు చెప్పి మన వాళ్లు బాలీవుడ్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తుంటారు కానీ.. ఆయన మాత్రం బాలీవుడ్ మీద తన గౌరవాన్ని చాటుకుని అక్కడి వాళ్లలో తనపట్ల గౌరవడం పెరిగేలా చేసుకున్నారు.



లేటెస్ట్ స్టన్నింగ్ షూట్‌లో కేతికా శర్మ ఎత్నిక్ గ్లామ్ లుక్ హృదయాలను గెలుచుకుంది



బోల్డ్ రెడ్ మిర్రర్ సెల్ఫీ లుక్‌లో అదరగొట్టిన ఎడిన్ రోజ్; ఆమె గ్లామర్‌ను చూసి ప్రశంసలు కురిపిస్తున్న అభిమానులు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com